సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 10 । జూన్ । 2025



కార్పొరేట్లకే షైనింగ్ స్టార్ పట్టం

షైనింగ్ స్టార్ పట్టాన్ని కార్పొరేట్లకే కట్టబెడుతున్నారు. సాక్షాత్తు ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. - 8లో



ఆగడాలు ఆపండి

గంజాయి బాబుల ఆగడాలు ఆపాలని పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు కోరారు. ఎస్పీని కలిసి మొర పెట్టుకున్నారు. - 8లో

బ్రెయిలీ పాఠ్యపుస్తకాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ఎన్జీవో సంస్థల్లో, ప్రభుత్వ రంగ సంస్థ ఎయిడెడ్ ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న చూపు లేని విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు కావాల్సిన బ్రెయిలీ పాఠ్య పుస్తకాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. పాఠ్య పుస్తకాల కోసం ఏపీడీఏఎస్‌సీపీసీ.ఏపీ.జీఓవీ.ఇన్ నందు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చీకటి రోజు

అధికార దుర్నీతికి పరాకాష్ట



సాక్షి చానెల్‌లో అమరావతి పై జరిగిన చర్చను వివాదాస్పదంగా చిత్రీకరిస్తూ టీడీపీ కార్యకర్తలు సాక్షి కార్యాలయాలపైన చేసిన దాడులను వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తుంది. ఇది అధికార దుర్నీతికి పరాకాష్ట. చర్చా కార్యక్రమాన్ని కారణంగా చూపి ఒక పథకం ప్రకారం సాక్షి ఆస్తులు ధ్వంసం చేయడం తప్పు. చర్చలో కృష్ణంరాజు వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం. సాక్షి యాజమాన్యం వాటికి తమకు సంబంధం లేదని ఇప్పటికే వివరణ కూడా ఇచ్చింది. అయినా దాడులు కొనసాగించడం కక్ష పూరితం. సీనియర్ పాత్రికేయులు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం దారుణం. ఆయనను వెంటనే విడుదల చేయాలి.

– ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

దాడి అమానుషం



ఎచ్చెర్ల సాక్షి యూనిట్ కార్యాలయంపైన టీడీపీ నేతలు దాడి చేయడం అమానుషం. దాడులకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు చేపట్టాలి.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

దాడి దుర్మార్గం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా పత్రికా స్వేచ్ఛపై దుర్మార్గపు చర్యలకు పాల్పడుతున్నారు. జిల్లా కేంద్రంలో సాక్షి కార్యాలయంపై జరిగిన దాడి అమానుషం. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం అనైతికం.

– పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, టెక్కలి

ప్రజాస్వామ్యానికి గాయం



మీడియాపై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని గాయపరిచినట్టే. చట్టపరంగా ఎలాంటి చర్యలైనా తీసుకోవచ్చు గానీ.. కార్యాలయాలపైకి దాడులకు తెగబడి ఆస్తులు ధ్వంసం చేయడం తగదు. ఇది ఏ పార్టీ వారైనా మంచిది కాదు. కొమ్మినేనిని వెంటనే విడుదల చేయాలి.

– చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయ కర్త

కూటమి కుటిలత్వం వికటాట్ట హాసం చేసింది. నిరసన ముసుగులో రౌడీయిజం రెచ్చిపోయింది. రాజకీయం రాక్షసంగా మారింది.

ప్రజాస్వామ్య సౌధానికి నాలుగో స్తంభమైన పత్రికా కార్యాలయంపైనే విరుచుకుపడింది. గోడలెక్కి.. నేమ్‌బోర్డు పీకేసి.. టైర్లు కాల్చి.. వీరంగం వేసింది.

పత్రికలు, టీవీల్లో వచ్చే వార్తలపై అభ్యంతరాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలుపవచ్చు. ఇంకా అనేక రూపాల్లో అసంతృప్తి ప్రకటించవచ్చు.

కానీ 'సాక్షి'పై కక్షగట్టిన పాలక టీడీపీ గూండాలు పోలీసుల కళ్లెదుటే పెచ్చరిల్లి దమనకాండకు తెగబడ్డారు.

దౌర్జన్యకాండ

అక్షర సాక్షిగా రాక్షసత్వం

- ఎచ్చెర్లలోని సాక్షి కార్యాలయంపై టీడీపీ నాయకుల గూండాయిజం
- రౌడీయిజం చూపించిన కేంద్ర మంత్రి బావ దాసునాయుడు
- ఆయన బాటలో మిగతా టీడీపీ శ్రేణులు
- పోలీసుల కళ్ల ముందే సాక్షి కార్యాలయంపై దాడులు
- వారిపై కేసులుండవా అని ప్రశ్నిస్తున్న జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు



ఈయన పేరు మెండ దాసునాయుడు. జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు. అంతకంటే ఆయనకున్న పెద్ద హోదా కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు బావ. ఎవరి మెప్పు కోసమో తెలియదు గానీ రౌడీయిజం చేశారు. 'సాక్షి' యూనిట్ కార్యాలయం ప్రహరీ పైకి ఎక్కి వీరంగం సృష్టించారు. అంతటితో ఆగలేదు. కార్యాలయం గోడకు ఉన్న సాక్షి నేమ్ బోర్డును టైర్లతో పీకి తగలబెట్టారు. సాక్షి ఆస్తుల ధ్వంసానికి ఒడిగట్టారు. ఈయన్నే మిగతా వాళ్లు అనుసరించారు. అంతా కలిసి బీభత్సం సృష్టించారు.



వీరిని చూడండి. సాక్షి ప్రధాన కార్యాలయం గోడ ఎక్కడమే కాకుండా లోపలికి ప్రవేశించి గలాట సృష్టించారు. కార్యాలయం ఎదుట కొందరు సాక్షి నేమ్ బోర్డును టైర్లతో కాల్చారు. సాక్షి ప్రతులను దహనం చేశారు. దీంతో టైర్ల పొగతో ఆ ప్రాంగణమంతా పొగమయమైంది.



సాక్షి ప్రధాన కార్యాలయం గోడ ఎక్కి ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు. నిరసన చేస్తామని చెప్పి ఆస్తుల విధ్వంసానికి పాల్పడ్డారు. పోలీసుల కళ్ల ముందే ఇదంతా చేశారు.



సాక్షి ప్రధాన కార్యాలయం గోడకు ఉన్న సాక్షి స్టీల్ నేమ్ బోర్డును పీకేసి, టీడీపీ మూకలు తగలబెడుతున్న దృశ్యమిది. అంతేకాదు అదే గోడపై పేడ విసిరారు. ఇదంతా పోలీసుల కళ్లముందే జరిగింది. కానీ ఏం చేయలేకపోయారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

కూటమి ప్రభుత్వంలో ఎవరైనా ప్రశ్నిస్తే చాలు కేసులు పెడుతున్నారు. గట్టిగా నిలదీస్తే జైలుకు పంపిస్తున్నారు. కానీ, ఒక పత్రిక కార్యాలయంపై పట్టపగలు దాడి చేస్తే మాత్రం కేసులుండవు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు బావ మెండ దాసునాయుడుతో మరి కొందరు టీడీపీ మూకలు రెచ్చిపోతున్నా చర్యలుండవు. చట్టాలు వారికి మాత్రమే చుట్టాలు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేసి రౌడీల్లా ప్రవర్తించినా పట్టించుకున్న నాథుడు లేడు. పోలీసుల కళ్లముందే ఇదంతా జరిగింది.

సాక్షి ఒక పత్రికా సంస్థ. ఆ ప్రాంగణంలోకి అనుమతి లేకుండా వెళ్లకూడదు. కానీ పోలీసుల కళ్ల ముందే దూసుకెళ్లడమే కాకుండా గోడ ఎక్కి, ఆస్తులు ధ్వంసం చేసి, వీరంగం సృష్టించారు. తొలుత కార్యాలయం ముందు టెంట్ వేశారు. ఆ తర్వాత నిరసన కారుల ముసుగులో దాడులకు దిగారు. పబ్లిక్‌గానే టీడీపీ నాయకులు బరితెగించారు. అధినేతల మెప్పు కోసం దిగజారి పోయి, సభ్య సమాజం తలదించుకునేలా వ్యవహరించారు. టీవీ డిబేట్‌లో ఒక విశ్లేషకుడు చేసిన వ్యాఖ్యలను సమర్థించబోమని సాక్షి ప్రకటన చేసింది. ఆ వ్యాఖ్యల సమయంలో డిబేట్ చేస్తున్న జర్నలిస్టు కూడా క్షమాపణ చెప్పారు. అయినప్పటికీ కేసులు నమోదు చేశారు. అంతటితో చాలదన్నట్టుగా సాక్షి ఆస్తులపై తెగబడ్డారు. ఆందోళన చేయడం తప్పు కాదు. శాంతియుతంగా ఎవరైనా నిరసనలు చేయవచ్చు. కానీ ఎచ్చెర్లలోని సాక్షి కార్యాలయం వద్ద జరిగిన ఘటనను చూసి జర్నలిస్టు, ప్రజా సంఘాలు సైతం ఆశ్చర్యపోయాయి. తొలుత కార్యాలయం ప్రహరీ ఎక్కి భయాందోళనకు గురి చేశారు. ఆ తర్వాత కార్యాలయం స్టీల్ నేమ్ బోర్డును టైర్లతో పీకేసి తగలబెట్టారు. అంతటితో ఆగకుండా కార్యాలయం గోడపైన, లోపలికి పేడ ముద్దలు విసిరారు. తర్వాత గేటును ఊడబీకేందుకు యత్నించారు. సాక్షి కార్యాలయం గేటుకు చెప్పుల దండ వేశారు. అప్పటికే వేసి ఉన్న తాళాన్ని పీకేసి వీరంగం సృష్టించారు. పోలీసులు అడ్డుకోవడానికి యత్నించినా టీడీపీ మూకలు వెనక్కి తగ్గలేదు. వారు ఏదైతే అనుకున్నారో అది చేసి వెళ్లిపోయారు. పాలకులే విధ్వంసం సృష్టిస్తే ప్రభుత్వమే ఉసిగొల్పితే ఇక శాంతి భద్రతలు ఏముంటాయి. రౌడీల చేతిలో పావులు అవుతాయి. హింసాత్మక చర్యలకు ప్రేరేపిస్తాయి. సాక్షి కార్యాలయం వద్ద సోమవారం అదే జరిగింది. పట్టపగలు పత్రికా కార్యాలయంపై దాడి చేసి, ఆస్తుల విధ్వంసానికి పాల్పడిన టీడీపీ నాయకులపై కేసులుండవా అని జర్నలిస్టు, ప్రజా సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. రౌడీరాజ్యంలో చీకటి దినంగా అభివర్ణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు.



● దాడిపై డీఎస్పీకి ఫిర్యాదు

ఎచ్చెర్లలో ఉన్న సాక్షి కార్యాలయంపై సోమవారం ఉదయం జరిగిన దాడిపై సాక్షి బ్రాంచ్ మేనేజర్ జేజీవీఆర్ స్వామి బెహరా, జిల్లా బ్యూరో చీఫ్ కందుల శివశంకర్ సోమవారం రాత్రి శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానందకు ఫిర్యాదు చేశారు. పత్రికా కార్యాలయాలపై దాడులుచేయడం సరికాదని, దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డీఎస్పీని సాక్షి యాజమాన్యం తరఫున కోరారు. అలాగే మండలాల వ్యాప్తంగా కూడా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేశారు.

దాడులు సరికాదు



పత్రికా స్వేచ్ఛను కాపాడే విధంగా రాజకీయ పార్టీలు ఉండాలే తప్ప ఓర్వలేక దాడులకు పాల్పడడం సరికాదు. ఎచ్చెర్ల సాక్షి ప్రింటింగ్ కార్యాలయంపై సోమవారం టీడీపీ యువజన విభాగం దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా. నిరసనలు తెలియజేసే హక్కు ఉందే తప్ప ఇలా దాడులకు తెగబడటం సరికాదు.

– బమ్మిడి శ్రీరామూర్తి, ఫ్యాప్టో చైర్మన్, యూటీఎఫ్ ప్రతినిధి

అధికార జులుంకు నిదర్శనం



అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇతరులకు ఆదర్శంగా ఉండాలే తప్ప ఇలా పత్రికా కార్యాలయాలపై దా డులకు దిగడం, వాటి ఆస్తులు ధ్వంసం చేయడం సిగ్గుచేటు. ఇలాంటి దాడులను అంతా ఖండించాలి. చట్ట ప్రకారం కేసులు పెడుతూ మరో వైపు ఇలా ప్రత్యక్ష దాడులు చేయ డం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు. కేవలం అధికారం ఉందనే భావనతోనే దాడులకు దిగుతున్నారు.

– కొన్న శ్రీనివాసరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

తీవ్రంగా ఖండిస్తున్నాం



ఎచ్చెర్లలోని 'సాక్షి' ప్రధాన కార్యాలయంపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నా. పత్రికా ఆస్తులను ధ్వంసం చేయడం శోచనీయం. మన జిల్లాలో ఇలాంటివి ఎప్పుడూ జరగలేదు. కొత్త సంస్కృతికి తెరతీశారు. ప్రతి ఒక్కరూ ఇలాంటి దాడులను ఖండించాలి. పత్రికలు లేకపోతే ప్రజాస్వామ్యంలో సామాన్యుడి వాదన బయటకు రాదు.

– ఆర్.సురేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు

ఇది చీకటి రోజు



సాక్షి కార్యాలయంపై టీడీపీ వర్గాలు దాడులు చేయడం దారుణం. జిల్లాలో ఇలాంటి సంప్రదాయం ఎప్పుడూ లేదు. అవసరమైతే చట్టాలను ఆశ్రయించాలి గానీ నేరుగా మీడియా సంస్థలపై దాడులు చేయడం పద్ధతి కాదు. ఇది చీకటి రోజు.

– పేడాడ శ్రీరామమూర్తి, న్యాయవాది, జి.సిగడాం

హక్కులు కాలరాస్తున్నారు



మీడియాపై అభ్యంతరాలు ఉంటే చట్ట పరిధిలో చర్యలు తీసుకోవాలి తప్ప ఇలా దాడులు చేయడం మంచిది కాదు. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేనిని అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే.

– సింగుపురం మోహన్‌రావు, న్యాయవాది, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, టెక్కలి.

ఇది విష సంస్కృతి



మీడియా సంస్థలు, జర్నలిస్టులపై రాజకీయ నేతలు దాడులు చేయడం విష సంస్కృతి. మీడియా సంస్థలు, జర్నలిస్టులు పొరపాట్లు చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకోవాలి తప్ప ఇలా దాడులు చేయడం మంచిది కాదు.

– ఎస్.షణ్ముఖరావు, సీపీఎం జిల్లా నాయకుడు, టెక్కలి

దాడులను ఖండిస్తున్నాం



జిల్లాలో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ రోజు కూటమి కార్యకర్తలు సాక్షి యూనిట్ కార్యాలయంపై దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టు సైతం అప్రజాస్వామికం. – బెండి నరసింగరావు, ఏపీయూడబ్ల్యూజే కౌన్సిల్ సభ్యుడు, టెక్కలి

మంచి పద్ధతి కాదు



సాక్షి కార్యాలయంపై కూటమి నాయకులు దాడులు చేయడం మంచి పద్ధతి కాదు. ఇలా చేస్తే మీడియా హక్కుకు భంగం కలుగుతుంది.

– వాన ప్రమీల, మహిళా నాయకురాలు, ఎండువ

మహిళలపై అఘాయిత్యాలు- ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన నేడు

నరసన్నపేట: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులు, అత్యాచారాలపై ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రం శ్రీకాకుళంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ప్రతీకాత్మక మౌన ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ మౌన నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా మధుసూదనరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా డి.మధుసూదనరావు నియమితులయ్యారు. ఇక్కడ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న వై.విశ్వమోహనరెడ్డికి ఏలూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా బదిలీ చేశారు. మధుసూదనరావు గుంటూరు నుంచి బదిలీపై జిల్లాకు వస్తున్నారు.

రోడ్డెక్కిన ఎండీయూ ఆపరేటర్లు



ధర్నా చేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు, ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ బియ్యంను ఇంటింటికీ అందజేసే ఎండీయూ వ్యవస్థ రద్దు చేయడం ద్వారా రాష్ట్రంలో 20 వేల కుటుంబాలు రోడ్డున పడతాయని, ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసు కోవాలని ఎండీయూ ఆపరేటర్ల రాష్ట్ర గౌరవాధ్యక్షు డు రౌతు సూర్యనారాయణ, ట్రేడ్ యూనియన్ జేఏసీ నాయకులు తిరుపతిరావు కోరారు. శ్రీకాకుళంలోని ఎన్జీఓ హోం నుంచి జిల్లా పరిషత్ వరకు సోమవారం ఎండీయూ ఆపరేటర్లు ర్యాలీ నిర్వహించారు. తమను విధుల్లోకి తీసుకోవాలని అగ్రిమెంట్ ఉన్నప్పటికీ ఇలా తొలగించడం తగదన్నారు. జూన్ 1 నుంచి 8 వతేదీ వరకు దాదాపు 4622 బస్తాల బియ్యం పక్కదారి పట్టిందని, దానిపై ఏం చర్య తీసుకున్నారో చెప్పాలన్నారు. తమ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. 'ఎండీయూ వ్యవస్థను మీరు రద్దు చేశారు.. సమయం వచ్చినప్పుడు మా 18500 కుటుంబాల సత్తా ఏమిటో చూపిస్తాం' అని హెచ్చరించారు. వరదల్లో, వానల్లో, అమరావతి శంకుస్థాపనల్లో రేయింబవళ్లు పనిచేసిన తమకు ప్ర భుత్వం ఈ రిటర్న్ గిఫ్ట్ ఇచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ వరదల్లో రోజుకు రూ.1500 ఇస్తామని చెప్పి చేతులెత్తేశారన్నారు. 15వ తేదీలోగా సానుకూల నిర్ణయం రాకపోతే.. అన్ని జిల్లాల కలెక్టరేట్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎండీయూ మండల ప్రెసిడెంట్ వరాహ నరసింహులు, వాసు, గోపి, హేమంత్, నవీన్, శ్రీనివాస్, వెంకట్రావు, జానకి రావు, మోహన్, సంతోష్, వెంకట్, బాలకష్ణ, అప్పలనాయుడు, రవి, కేంబూరు అప్పలనాయుడు, అనిల్, రామారావు, కుమార్, దాసు, దీనబంధు, ఉమామహేశ్వరరావు, కష్ణ, ప్రసాద్, గోవిందరాజులు, కిల్లి మోహన్, నాగేశ్వరరావు, జిల్లావ్యాప్తంగా ఉన్న ఎండీయూ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

భయపడతారనే గోప్యతట..!

● పూసర్లపాడు వృద్ధురాలికి కరోనా పాజిటివ్

గార: జిల్లాలో చాలాకాలం తర్వాత మళ్లీ కరోనా కేసు నమోదైంది. అయితే వివరాలు వెల్లడించేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. శనివారం గార మండలం పూసర్లపాడుకు చెందిన 81 ఏళ్ల వృద్ధురాలికి కరోనా నిర్ధారణ జరిగింది. ఈ విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచినప్పటికీ రిమ్స్‌లో కోవిడ్ ప్రత్యేక వార్డులో ఈ మహిళను ఉంచి చికిత్స చేస్తుండటంతో విషయం బయటకు వచ్చింది. అయితే ప్రజలు భయపడతారనే వివరాలు వెల్లడించలేదని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో పరీక్ష కిట్లే అందుబాటులో లేని తరుణంలో అధికారులు గోప్యత పాటించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

కోవిడ్ కేసు వాస్తవం

జిల్లాలో ఒకరికి కోవిడ్ పాజిటివ్ రావడం వాస్తవం. నిబంధనలు ప్రాప్తికి వివరాలు వెల్లడించకూడదు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉంది.

– డాక్టర్ అనిత, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

● యోగా.. అంతా కలిసి రాగా..



శ్రీకాకుళం కల్చరల్: యోగాంధ్రలో భాగంగా శ్రీకాకుళంలో సోమవారం మాస్ యోగా ర్యాలీ ఉత్సాహంగా జరిగింది. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, పౌరులు, పెద్దఎత్తున పాల్గొన్నారు. నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు జరిగిన యోగా ర్యాలీలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏడురోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు.

'విద్యాశాఖ మంత్రి లోకేష్ కనిపించడం లేదు'

- ప్రభుత్వ తీరును నిరసిస్తూ టీచర్ల ఆందోళన



నిరసన దీక్షలో విద్యాశాఖ మంత్రి లోకేష్ కనిపించడం లేదని ప్లకార్డు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాకుళం న్యూకాలనీ: తాము ఎంత ప్రయత్నించినా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ కనిపించడం లేదని, తమకు అందుబాటులోకి రావడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. అనవసరంగా నమ్మి మోసపోయామని, తమకూ ఓ రోజంటూ వస్తుందని, అప్పుడు ఉద్యోగ, ఉపాధ్యాయుల తడాఖా చూపిస్తామని స్పష్టం చేస్తున్నారు. ఉపాధ్యాయులను వంచించిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక పిలుపు మేరకు శ్రీకాకుళం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక స్టీరింగ్ కమిటీ సభ్యులు సంపతిరావు కిశోర్‌కుమార్, మజ్జి మదన్ మోహన్ ఆధ్వర్యంలో గొంటి గిరిధర్, చౌదరి రవీంద్ర, పిసిని వసంతరావు, దుప్పల శివరాంప్రసాద్, వెంకటేశ్వరరావు, రమణ, శ్రీరామ్మూర్తి, శరత్‌బాబు, కాశీవిశ్వనాథ్, ఎండ ఉమాశంకర్, దామోదరరావు, శంకరరావు, శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సాధారణ బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లు, పండిట్లు, పీఈటీల బదిలీలను మాన్యువల్‌గా చేపడతామని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమావేశంలో అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు విద్యాశాఖ ఉన్నతాధికారులు హామీ ఇచ్చారని, తీరా ఇప్పుడేమో ఆన్‌లైన్ బదిలీలంటూ.. వెబ్ ఆప్షన్స్ ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. నిరసన దీక్ష వద్ద స్టీరింగ్ కమిటీ సభ్యులు సంపతిరావు కిశోర్‌కుమార్ సొమ్మసిల్లి పడిపోయారు. ఆయనను సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా కంచమ్మ తల్లి సంబరాలు



పూజలందుకుంటున్న కంచమ్మతల్లి నమూనా విగ్రహం

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో నిర్వహిస్తున్న కంచమ్మ తల్లి గ్రామదేవత సంబర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 8వ రోజైన సోమవారం కూడా అమ్మవారిని సాయంత్రం తిరువీధుల్లో ఊరేగించారు. అమ్మవారిని పీఠస్థానం నుంచి మఠం కంచిలి తీసుకొచ్చి, అక్కడి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా జాతీయ రహదారి కూడలి వరకు ఊరేగించారు. ఆదివారం అర్ధ రాత్రి దాటిన వరకు జబర్దస్త్, ఢీ డ్యాన్స్ టీం యాక్టర్స్ అలరించారు.

శ్రీముఖలింగంలో పండిత సదస్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో పాంచరాత్రి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా జ్యేష్ఠ మాసం నాల్గో రోజు సోమవారం అంకురార్పణ, హోమం, పండిత సదస్యం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామికి ప్రత్యేక పూజలు, ఏకవార అభిషేకాలు నిర్వహించారు. దీనికి ముందు స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే వారాహి అమ్మవారికి మహిళలు ఘనంగా పూజలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో నాగరాజు మృతదేహం

కవిటి: ఇచ్ఛాపురం పట్టణం ఉప్పలవీధికి చెందిన గేదెల నాగరాజు(32) అనే వ్యక్తి ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఘటనకు సంబంధించి కవిటి ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కంచిలిలో జరుగుతున్న అమ్మవారి పండుగల కోసం నాగరాజు మధ్యాహ్నం 1 గంటకు ఇచ్ఛాపురం నుంచి కంచిలి చేరుకున్నాడు. అక్కడ రోజంతా ఉండి రాత్రి 8 గంటలకు సొంతూరు ఇచ్ఛాపురానికి బయలుదేరాడు. ఈ తిరుగు ప్రయాణంలో కవిటి మండలం జాతీయ రహదారిలో సర్పంచ్ దాబా దాటిన తర్వాత జమేదారుపుట్టుగ జంక్షన్‌కు చేరుకునే సమయానికి బండి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో ఆయన తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. విషయం తెలుసుకున్న మృతుని కుటుంబసభ్యులు ఘటన స్థలానికి వేకువజామున చేరుకున్నారు. మంగళవారం ఉదయం ఇచ్ఛాపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ రవివర్మ తెలిపారు.

కార్పొరేట్‌కే.. షైనింగ్ స్టార్ పట్టం



షైనింగ్ అవార్డులు అందుకున్న విద్యార్థులతో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఇన్‌చార్జి మంత్రి కె.శ్రీనివాస్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు



విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- షైనింగ్ స్టార్ పేరుతో విద్యార్థులకు అవార్డుల అందజేత
- మెజారిటీ విద్యార్థులు కార్పొరేట్/ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన వారే
- కార్పొరేట్‌ను స్వయంగా ప్రోత్సహిస్తున్న కూటమి ప్రభుత్వం
- కేంద్రమంత్రి, ఇన్‌చార్జి మంత్రి చేతులమీదుగా పురస్కారాల అందజేత



స్కౌట్స్ అండ్ గైడ్ విద్యార్థులతో పిరియా విజయ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో కార్పొరేట్ విద్యను స్వయంగా ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. అక్కడ చదువుతూ టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు నజరానా అందజేసింది. ఇందుకు తాజాగా రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డుల ఎంపికే ఉదాహరణ. తాజాగా ముగిసిన 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను షైనింగ్ స్టార్ల కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. అంతవరకు బాగానే ఉన్నా.. అక్కడే తమ అసలు రంగు బయటపెట్టింది. ఎంపికచేసిన షైనింగ్ స్టార్ల జాబితాలో మెజారిటీ విద్యార్థులు కార్పొరేట్/ప్రైవేటు విద్యాసంస్థల వారే కావడం గమనార్హం.

టెన్త్‌క్లాస్‌లో 178, ఇంటర్‌లో 35 మంది ఎంపిక

జిల్లా నుంచి షైనింగ్ స్టార్ అవార్డులకు పదో తరగతి విద్యార్థులు మొత్తం 178 మంది ఎంపికయ్యారు. ఇందులో వివిధ ప్రభుత్వ యాజమాన్య విద్యాసంస్థల విద్యార్థులు 93 మంది ఉండగా.. ప్రైవేటు విద్యార్థులే 85 మంది ఉండటం విశేషం. అలాగే ఇంటర్మీడియెట్ నుంచి షైనింగ్ స్టార్ అవార్డులకు మొత్తం 35 మంది ఎంపిక కాగా.. ఇందులో ప్రైవేటు కాలేజీ విద్యార్థులు ఏకంగా 23 మంది ఉండగా, ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు కేవలం 12 మంది మాత్రమే ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సర్కారు విద్యార్థులకే పట్టం

గత వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు పేరిట ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న వారిని ప్రోత్సహించాలని టెన్త్‌క్లాస్, ఇంటర్మీడియెట్ ఫలితాల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. నాడు పాఠశాల/కళాశాల స్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి అంటూ ఐదుస్థాయిల్లో సత్కారాలు చేసి అవార్డులు, రివార్డులు అందజేశారు.

పురస్కారాలు అందజేసిన కేంద్రమంత్రి, ఇన్‌చార్జి మంత్రి

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రభుత్వాలపైన ఉందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని 80 అడుగుల రోడ్‌లో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడుతో కలిసి విద్యార్థులకు రూ.20వేల చొప్పున పురస్కారాలను అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాశాఖపై ప్రత్యేకంగా దృష్టిసారించాయని కేంద్రమంత్రి అన్నారు. అంతకుముందు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ విద్యార్థులతో ముచ్చటించారు.

అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అవార్డులకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. అంతకుముందు స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు అతిథులకు వెల్‌కమ్ చెప్పి.. ఆహ్వానించే కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు విద్యార్థులతో కలిసి పంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గొండు శంకర్, బగ్గు రమణమూర్తి, ఆర్డీఓ సాయిప్రత్యూష, ఇంటర్మీడియెట్ విద్య డీఐఈఓ ఆర్.సురేష్‌కుమార్, ఆర్ఐఓ పి.దుర్గారావు, డీఈఓ ఎస్.తిరుమల చైతన్య, విజయకుమారి, లియాకత్ ఆలీఖాన్, వివిధ పాఠశాలలు, కళాశాలల ప్రతినిధులు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పు పడుతున్న కూటమి నాయకులు..

జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన అవార్డుల పంపిణీకి వచ్చిన టీడీపీ నాయకులను సైతం విద్యార్థుల జాబితా ఆశ్చర్యానికి గురిచేసింది. స్థానికంగా ఓ సీనియర్ నేత బాహాటంగానే విమర్శలు గుప్పించారు.

తమ చినబాబు చేస్తున్న దుశ్చర్యల కారణంగా ప్రభుత్వ పరువు, ప్రతిష్ట రోజురోజుకీ దిగజారిపోతోందని పక్కన ఉన్న వ్యక్తులతో తన ఆవేదనను వ్యక్తం చేశారు. చినబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై కూటమి పార్టీ నేతలు పెదవి విరుస్తున్నారు.

‘స్టీల్‌ప్లాంట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి’



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో చట్టవిరుద్ధంగా తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, కార్మికుల పోరాటంపై పోలీస్ నిర్బంధాన్ని ఎత్తివేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, యాజమాన్యం ఉక్కు కార్మికులపై కక్ష కట్టాయని, కార్మికులను తీవ్రంగా భయపెట్టి, తొలగించి, పోలీస్ నిర్బంధంతో ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుల పోరాటంపై ఉక్కుపాదం మోపాయని అన్నారు. దేశంలో అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులున్నా ఒక్క విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రమే సొంత గనుల్లేవని అన్నారు. టీడీపీ, జనసేన నాయకత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కాపాడాలని కోరారు.

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ ఆంక్షలు: ఎస్పీ

శ్రీకాకుళం క్రైమ్ : పాత శ్రీకాకుళంలో మంగళ, బుధవారాల్లో జరగనున్న పెద్దమ్మతల్లి, నూకాలమ్మతల్లి సిరిమాను ఉత్సవం నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, మళ్లింపు చర్యలు చేపట్టనున్న కారణంగా ప్రజలు సహకరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన జారీ చేశారు.

- పొట్టి శ్రీరాములు కూడలి నుంచి జిల్లా పరిషత్, సంతోషిమాత గుడి, కలెక్టర్ బంగ్లా మీదుగా కునుకుపేటకు వెళ్లేందుకు ఎలాంటి వాహనాలకు అనుమతి లేదు.
- 80 అడుగుల రహదారి, వాంబేకాలనీ మీదుగా కునుకుపేటకు వెళ్లేందుకు కూడా వాహనాలకు అనుమతి లేదు.
- కునుకుపేట నుంచి కలెక్టర్ బంగ్లా, సంతోషిమాత గుడి, జిల్లా పరిషత్ మీదుగా పొట్టి శ్రీరాములు జంక్షన్‌కు చేరేందుకు వాహనాలకు అనుమతి లేదు.
- శ్రీకాకుళం పట్టణం నుంచి కునుకుపేటకు వెళ్లాల్సిన వారు 80 అడుగుల రోడ్డు కూడలి, అరసవల్లి, ఖాజీపేట మీదుగా కునుకుపేటకు చేరుకోవాలి.
- వాహనాల పార్కింగ్ నిమిత్తం పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద పోలీస్ పెట్రోల్ బంక్ వెనుక భాగం ఖాళీ స్థలం, 80 అడుగుల రోడ్డు మార్గంలో ఎంపీ నివాసం పక్కన ఉన్న ఖాళీ స్థలం, అదే విధంగా ఎగ్జిబిషన్ పక్కన ఉన్న వాకింగ్ మైదానంలో మాత్రమే వాహనాల పార్కింగ్ చేసుకోవాలి.
- ఈ ట్రాఫిక్ మళ్లింపు చర్యలు జూన్ 10 మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రాత్రి 12 గంటల వరకు వర్తిస్తాయి. జూన్ 11 బుధవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వర్తిస్తాయన్నారు.

‘జిల్లా అభివృద్ధికి కార్యాచరణ’

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి స్పష్టమైన దిశ, కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు సోమవారం విజయవాడలోని సచివాలయం నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్చువల్ ద్వారా స్వర్ణాంధ్ర కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం జరిగిన చర్చలో కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కేంద్ర మంత్రి మాట్లాడారు.

కేంద్రాస్పత్రిలో పనిచేయని లిఫ్ట్

టెక్కలిరూరల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రిలో లిఫ్ట్ మూడు రోజులుగా పనిచేయడం లేదు. పై ఫ్లోర్‌లో డయాలసిస్ కేంద్రం ఉండడంతో మెట్లు ఎక్కి వెళ్లలేక కిడ్నీ వ్యాధి బాధితులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. మూడు రోజులవుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని రోగులు, వారి బంధువులు కోరుతున్నారు.

పశువుల తరలింపు అడ్డగింత

నరసన్నపేట: ఒడిశాలోని కనుసు సంత నుంచి జాతీయ రహదారిపై అలమండకు అక్రమంగా తరలిస్తున్న గేదెల వ్యాన్‌ను నరసన్నపేట పోలీసులు అడ్డుకున్నారు. నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్‌తో పాటు పెట్రోలింగ్ వాహన సిబ్బంది సంయుక్తంగా వాహనాన్ని అడ్డుకున్నారు. సోమవారం వేకువజామున మడపాం టోల్‌గేట్ వద్ద తనిఖీల్లో వ్యాన్‌ను అడ్డుకుని అనుమతులు లేనట్టు గుర్తించారు. వ్యాన్‌లో 16 గేదెలు ఉండగా ఆరు గేదెలు చనిపోయి ఉన్నాయి. వెంటనే విశాఖ వద్ద గోశాలకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

గంజాయి బాబుల ఆగడాలు ఆపండి

- ఎంపీటీసీ సహా ఐదుగ్రామాల సర్పంచ్‌ల ఆవేదన
- ఎస్పీకి ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం ముందు ఐదు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ, ఆయా గ్రామస్తులు

శ్రీకాకుళం క్రైమ్ : ‘గంజాయి బాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. మా గ్రామాలను ఆనుకొని ఉన్న తోటల్లో, పొలాల్లోని నిర్మానుష్య ప్రదేశాలే స్థావరాలుగా చేసుకుంటున్నారు. పేకాట శిబిరాలు సైతం నిర్వహిస్తున్నారు. ఎవరైనా రాత్రి పూట బయటకు వెళ్లాలన్నా.. బయటనుంచి ఊళ్లోకి రావాలన్నా.. రోడ్డు మీద ఎవరి మీద దాడి చేస్తారో.. ఏ ఒంటరి ఆడపిల్ల మీద అఘాయిత్యం చేస్తారోనని భయంగా ఉంది’ అంటూ ఎచ్చెర్ల మండలంలోని ఐదు పంచాయతీల సర్పంచులు, ఓ ఎంపీటీసీ ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.

సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ధర్మవరం, పొన్నాడ, భగీరథపురం, ముద్దాడ, కొంగరాం గ్రామాల సర్పంచ్‌లు అల్లు కన్నబాబు, నేతింటి నీలం అప్పడు, నక్క కృష్ణమూర్తి, ముద్దాడ శంకరరావు, గుండ రవిలే కాక బొంతలకోడూరు ఎంపీటీసీ మాడుగుల జగదీష్‌లు, ఆయా గ్రామస్తులు ఎస్పీకి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదులో ఏముందంటే..

తమ గ్రామాల్లోకి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఆటోలు, బళ్లు, వ్యానులలో వచ్చి గ్రామంలో పడి దేవాలయాల్లో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు, పొలాల్లో మోటార్లు, ఆయిల్ ఇంజిన్లు, ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాక్టర్లలో విలువైన పార్టులు, ఇళ్లలో సామాన్లు, బంగారం, పాడి సంపదైన ఆవులు, గొర్రెలు, మేకలు ఎత్తుకుపోతున్నారని తెలిపారు. వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ధర్మవరంలో జగనన్న కాలనీలో మోటారును, శ్మశానంలో సర్వీసు వైరును ఎత్తుకుపోయారన్నారు. ఉగాది నాడు సింతు సత్యం అతని సోదరుడు ఇంట్లో సుమారు 12 తులాల బంగారం చోరీకి గురైందని ఇప్పటికీ జాడలేదని, పొన్నాడలో నాలుగు ట్రాక్టర్ల బ్యాటరీలు, ఓ ట్రాక్టర్ గేజ్‌వీల్స్, ముద్దాడ, భైరిపురం, ఎస్ఎంపురం గుళ్లల్లో ఆభరణాలు చోరీ చేశారన్నారు.

కొన్ని స్థావరాల్లో..

పొన్నాడ కస్తూర్బా స్కూలు సమీపంలోను, కొంగరాం–పొన్నాడ లింకురోడ్డు సమీపంలోను తోటలు, పొలాలను గంజాయి బాబులు స్థావరాలుగా మార్చుకున్నారని తెలిపారు. మత్తు పదార్థాలు సేవించిన అనంతరం పొన్నాడ బ్రిడ్జి లింకు తోట పాలెం రూట్‌లో వాణి పబ్లిక్ స్కూలు సమీపంలో ఓ కిల్లీకొట్టు, నూడుల్స్‌కొట్టులో గడుపుతారని, బ్రిడ్జి దాటాక వరుసగా ఉన్న దాబాల్లో సైతం హల్‌చల్ చేసి రాత్రి 11 తర్వాత గ్రామాల్లో గ్రూపులుగా తిరుగుతారని విలేకరులతో అన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సర్పంచులతో పాటు జి.ఎర్ర నాయుడు, నక్క జగదీష్, కరగాన గణేషు, ఎర్ర వైకుంట తదితరులున్నారు.

అర్జీల పరిష్కారమే ప్రధానం

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జేసీకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీల పరిష్కారానికి అధికారులు స్పష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో ఆయన అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలపై నాణ్యమైన ఎండార్సుమెంటు వేయాలని ఆదేశించారు.

కొన్ని వినతులు..

- చదువు పేరును అడ్డు పెట్టుకుని పుస్తకాల పేర్లతో రాష్ట్రంలో కోట్లాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని, ఫీజులు అధికంగా వసూలు చేస్తూ విద్యార్థుల ప్రాణాలను బలి పెడుతున్నారని, ఆయా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ఫిర్యాదు చేశారు.
- జలుమూరు మండలం టెక్కలపాడు గ్రామంలో దివ్వలస వెంకటరమణ అనే దళితుడు తన ఇంటిని పెత్తందారులు ఆక్రమించుకుని వేధిస్తున్నారని ఫిర్యాదు చేశారు.

ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తివేయడం అన్యాయం

ఎలాంటి నిబంధనలు పాటించకుండా ప్రాథమికోన్నత పాఠశాలలను ఎత్తివేయడం అన్యాయమని, దీని వల్ల గ్రామీణ పేదలు విద్యకు దూరమవుతారని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఫిర్యాదు చేశారు. ఆమదాలవలస నియోజకవర్గంలో గల 22 ప్రాథమికోన్నత పాఠశాలలు, 20 స్కూల్‌లను ప్రైమరీ స్కూళ్లుగా మార్చి అప్పర్ ప్రైమరీ తరగతులు ఎత్తేశారని, దీని వల్ల విద్యార్థులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆమదాలవలస మండలం, బొబ్బిలిపేట గ్రామానికి చెందిన పేడాడ భరత్ కుమార్ అనే విద్యార్థికి జిల్లాలోని రెసిడెన్షియల్ స్కూల్ లో చదువుకునేందుకు సీట్ ఇప్పించాలని కోరారు. సరుబుజ్జిలి మండలం, గోనెపాడు పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ను రాజకీయ కారణాలతో విధుల నుంచి తొలగించారన్నారు.

- ఇచ్ఛాపురం మండలం ఈదుపురం ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న మద్యం షాపు తొలగించాలని గ్రామానికి చెందిన ఉప్పాడ భాస్కరరావు, శీరపు నర్సింహమూర్తి, అంబటి పురుషోత్తం కోరారు. ఈదుపురం బిడ్జికి ఇరువైపులు విద్యుద్దీకరణ చేయాలని తెలిపారు. డొంకూరుకు పల్లె వెలుగు బస్సులు నడపాలని కోరారు.
- ఆమదాలవలసలో ఉపాధి నిధుల కాజేతకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఆపాలని సువ్వారి గాంధీ కోరారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 57 ఫిర్యాదులు

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (గ్రీవెన్సు)కు 57 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరించి సకాలంలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

20న తపాలా అదాలత్

శ్రీకాకుళం అర్బన్: ఈ నెల 20వ తేదీన 118వ తపాలా అదాలత్ ఉంటుందని పోస్టుమాస్టర్ జనరల్, విశాఖపట్నం రీజియన్ కార్యాలయపు సహాయ సంచాలకులు కేవీడీ సాగర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు జూన్ 20వ తేదీ (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఎంవీపీ బస్ కాంప్లెక్స్ పక్కన విశాఖపట్నంలో పోస్టుమాస్టర్ జనరల్ వారిచే 118వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

తపాలా సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ ఆదాలత్‌లో చర్చిస్తామన్నారు. శ్రీకాకుళం, పార్వతీపురం, మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని తపాలా వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులు జూన్ 16వ తేదీలోగా 118వ తపాలా అదాలత్ అను శీర్షికతో ‘ కెవిడి సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టుమాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం 530017’ అనే చిరునామాకు పంపాలని కోరారు. గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు.

ఉత్సాహంగా జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



క్రీడాకారులకు సూచనలు చేస్తున్న అథ్లెటిక్స్ సంఘ జిల్లా ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ కొన్న వెంకటేశ్వర రావు (వాసు), అథ్లెటిక్స్ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు కొన్న మధుసూదనరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఆర్ట్స్)కళాశాల మైదానంలో నిర్వహించిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. ఎంపికలకు హాజరైన అథ్లెట్స్‌కు 100, 200, 400, 800, 1600 మీటర్ల పరుగు పందాలు, 5కేఎం వాక్, రన్, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, హేమర్‌త్రో వంటి అథ్లెటిక్స్ ఈవెంట్స్ జరిగాయి.

ఇక్కడ ఎంపికైన అథ్లెట్స్‌ను ఈ నెల 14, 15 తేదీల్లో గుంటూరులో జరిగే ఏపీ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలకు పంపిస్తామని కొన్న మధుసూదనరావు పేర్కొన్నారు. తొలుత క్రీడాకారులకు ఎంపికల తీరుతెన్నులు, విధివిధానాలపై సంఘ నాయకులు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, కె.హరిబాబు, కె.మాధవరావు, శ్రీనివాసరావు, పద్మలోచన, పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం పాతబస్టాండ్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం(డిసెంబర్-3)కు గాను వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులకు, దివ్యాంగ సాధికారతకు కృషి చేస్తున్న సంస్థలకు, వ్యక్తులకు జాతీయ అవార్డులు ప్రదానం చేస్తారు.

ఈ అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విభిన్న ప్రతిభావంతుల, వయోవృద్ధుల సంస్థ ఏడీ కె.కవిత ఒక ప్రకటనతో తెలిపారు. అవార్డుల కోసం జూలై 15వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో www.awards.gov.inలో చేయాలని, దీనికి సంబంధించిన గైడ్‌లైన్స్, అప్లికేషన్ కోసం www.depwd.gov.in వెబ్ సైట్‌ను సందర్శించాలని తెలిపారు.